

నవోదయలో ప్రవేశానికి 10న పరీక్ష

ప్రజాశక్తి-పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి ఈ నెల 10వ తేదీ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:45 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఆర్.కమలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష పెద్దాపురం, సామర్లకోట రెండు పట్టణాల పరిధిలో 6 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందే హాజరవ్వాలన్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి వచ్చిన ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా..

- ఎఎంసిల్లో పనులకు మంజూరు కాని నిధులు
- కానరాని పుంత రోడ్ల నిర్మాణం
- పశువైద్య శిబిరాలకు మంగళం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీల ప్రాబల్యం నానాటికీ తగ్గిపోతోంది. లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయం సమకూరుతున్నా రైతుల ప్రయోజనాలు నానాటికీ తగ్గిపోతున్నాయి. రోజులు గడిచే కొద్దీ మార్కెట్ కమిటీల అభివృద్ధి కుంటుపడుతోంది. కాకినాడ అర్బన్, కరప, కాకినాడ రూరల్, పిఠాపురం, తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, సామర్లకోట, పెద్దాపురంలో 9 మార్కెట్ కమిటీలున్నాయి. గతంలో కొన్ని మార్కెట్ కమిటీలు రెండేసి నియోజకవర్గాల్లో ఉండేవి. పాలనాపరంగా ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు ఒక్కో నియోజకవర్గానికి ఒక మార్కెట్ కమిటీ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది రూ.36.26 కోట్లు మార్కెట్ సెస్ వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 65 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రతి సంవత్సరం ఆదాయం పెరుగుతూ వస్తుంది. లక్ష్యాలను సాధించడంలో ఎఎంసిలు ముందుంటున్నాయి. గతంలో చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో ఆదాయం పూర్తిగా పడిపోయింది. ఫలితంగా పాలకవర్గాలు మరింత నిరుత్సాహ పడ్డాయి. కేంద్రం మళ్లీ చెక్ పోస్టులకు అవకాశం కల్పించడంతో ఎఎంసిల ఆదాయం పెరుగుతుండడంతో లక్ష్యాలను చేరుకుంటున్నాయి. మార్కెట్ కమిటీల అభివృద్ధికి మాత్రం ప్రాధాన్యం ఇవ్వలేకపోతున్నాయి. ప్రతి మార్కెట్ కమిటీ ఆదాయంలో 20 శాతం రైతుల ప్రయోజనాలకు వెచ్చించాలన్న నిబంధనను వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టింది. గతంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి రైతులకు సేవలందించేవారు. పశువైద్య శిబిరాల ద్వారా పాడి రైతులకు మందులు అందించేవారు. కానీ నాలుగేళ్లుగా పశు వైద్య శిబిరాల జాడ కనిపించడం లేదు. పాడి రైతులకు సహకారం కరువైంది. దీంతో ప్రైవేట్ వైద్య సదుపాయాలపైనే ఈ రైతులు ఆధారపడాల్సి వస్తోంది. పుంత రహదారుల అభివృద్ధి కూడా గత నాలుగేళ్లుగా నిలిచిపోయింది. గతంలో కొంత రహదారుల అభివద్ధికి ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేసిన ప్రభుత్వం నుంచి ఆమోదం లభించకపోవడంతో వాటి పనులు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించే వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీల గోదాముల్లో ఉత్పత్తులను దాచుకుని మంచి ధర వచ్చిన తర్వాత అమ్ముకోవచ్చు. గతంలో రైతుబంధు పథకం ద్వారా ఈ వెసులుబాటు ఉండేది. అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో పలువురు రైతుల తమ ఉత్పత్తులను తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో 16 గోదాముల ఉన్నాయి. ఇవి 15,055 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ప్రస్తుతం కొన్ని నిండి ఉన్నప్పటికీ రైతులు ఎవరూ వీటిని సక్రమంగా ఉపయోగించుకోలేకపోతున్నారు. మరోవైపు ఏళ్ల తరబడి కమిటీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదు. జిల్లావ్యాప్తంగా 77 మందికి గానూ 22 మంది మాత్రమే పని చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 75 మంది వరకూ పని చేస్తున్నారు. జూనియర్ మార్కెట్ సూపర్ వైజరు నుంచి మార్కెట్ కమిటీ కార్యదర్శి వరకూ ఖాళీలు ఉన్నాయి.



ఈ-విక్రయాలు నిల్

రైతులు పండించిన ఉత్పత్తులను ఆన్ లైన్ ద్వారా కొనుగోలు చేయడంతో పాటు మంచి ధర కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ-విక్రయాలు (ఈ-ఫామ్ మార్కెటింగ్) మూడేళ్ల క్రితం ప్రారంభించింది. దీని ద్వారా రైతుల పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ కార్యక్రమం మధ్యలో నిలిచిపోయింది. అప్పటి నుంచి విక్రయాల ఊసెత్తడం లేదు.

ఉత్సవ విగ్రహాలుగా మార్కెట్ కమిటీలు

వ్యవసాయ మార్కెట్ కమిటీలు అంటే గతంలో ఎంతో డిమాండ్ ఉండేది. ఎంఎల్ఎ తర్వాత నియోజకవర్గంలో ఎఎంసి చైర్మన్లకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. ఎఎంసిలకు ఆదాయం సమకూర్చడమే కాక రైతుల అవసరాలను తీరుస్తున్నామన్న సంతృప్తి ఉండేది. దీంతో చైర్మన్ పదవుల కోసం పెద్ద లాబీయింగ్ నడిచేది. సామాజిక వర్గాల వారీగా చైర్మన్ పదవుల కోసం పోటీ పడేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎఎంసి పాలక వర్గాలంటే కేవలం రాజకీయ నాయకులకు పదవులు కల్పించడమేనన్న చులకన భావం ఏర్పడింది. రైతుల కోసం పనిచేసే పరిస్థితి లేదు. కేవలం ఉద్యోగుల జీత భత్యాలు ఇచ్చే తీర్మానాలకే ఎఎంసిలు పరిమతం అవుతున్నాయి.

వారసత్వ సంపదను రక్షించుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ నగరంలోని పురాతన సంపదను రక్షించుకోవాలని, పురాతన కట్టడాలను కాపాడుకోవాలని కరువు, వరదల నివారణ ప్రపంచ ప్రజా కమిషన్ చైర్మన్, రామన్ మెగసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్ర సింగ్ అన్నారు. గురువారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో వారసత్వ సంపద సంరక్షణపై నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద సమాజం మొత్తానికి చెందుతుందని వీటిని పరిరక్షించుకొని భవిష్యత్ తరాలకు అందజేయాలన్నారు. వారసత్వ సంపదలో పకృతి వనరులు, మడ అడవులు, హోప్ ఐలాండ్, తూర్పు తీర ప్రాంతం పర్యావరణం అన్నీ కూడా భాగమేనని ఆ సంపద ప్రజల ఆస్తి అని చెప్పారు. కాకినాడలోని చారిత్రాత్మక ఎంఎస్ఎన్ చారిటీస్ భూములను, ఆస్తులను కొల్లగొట్టాలని చూస్తున్నారన్నారు. పూర్వ కట్టడాలను ఆస్తులను కాపాడవలసిన వారే వాటిని అన్యాక్రాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని ఎంఎస్ఎన్ చారిటీస్, పెద్ద మార్కెట్, పిఆర్ కళాశాల, మెక్లారిన్ పాఠశాల, కోస్తా తీర ప్రాంతాలను కాపాడుకోవాలని పిలుపు ఇచ్చారు. కొన్ని ట్రస్టులు ఆయా సంపదకు రక్షణగా నిలుస్తున్నాయని, కానీ ఆ ఆస్తులు కాపాడవలసిన దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాజేంద్ర సింగ్ హిందీ ప్రసంగాన్ని పర్యావరణ సామాజికవేత్త బొలిశెట్టి సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు. పిడబ్ల్యుసిడిఎఫ్ కో- ఆర్డినేటర్ ప్రెసింగి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుకె ప్రొఫెసర్లు డాక్టర్ మురళీకష్ణ, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, సామాజికవేత్తలు చిక్కాల దొరబాబు, పి.శివశంకర్, టికె.విశ్వేశ్వర్ రెడ్డి, కె.మృత్యుంజయరావు, ఐ.దోసగిరిరావు, గూడూరు వెంకటేశ్వరరావు, వక్కలంక రామకృష్ణ, చిక్కాల అబ్బు, నందమూరి వినోద్, ఉద్దండ రాజ్యలక్ష్మి, జి.సత్యమూర్తి, మల్లాడి రాజు, పప్పు దుర్గా రమేష్, ఎండి జవహర్ ఆలీ, కిషోర్ కుమార్, దూసర్లపూడి రమణ రాజు, విబిఎల్ఎన్.మూర్తి, బివి.రమణమూర్తి, వైదాడి నూక రాజు, కొప్పనాతి శ్రీనివాసరావు, ఆకుల ప్రవీణ్, ఎపిజె విను, పోలసపల్లి సరోజ, పెద్దింశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్ర సింగ్

2వ రోజు శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన గురువారం 2వ రోజు కొనసాగింది. యూనియన్ నాయకులు డి.దుర్గాప్రసాద్, సిహెచ్.పుష్ప మాట్లాడుతూ 2021 నుంచి జిజిహెచ్‌లో శానిటేషన్ నిర్వహణ కాంట్రాక్టు పొందిన కృష్ణా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గతంలో ఎన్నడూ లేని విధంగా పిఎఫ్ చెల్లింపుల్లో యజమానులు చెల్లించాల్సిన వాటా కూడా కార్మికుల జీతాల నుంచి కత్తిరిస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేసేవరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, యూనియన్ నాయకులు జె.లక్ష్మీప్రియ, ఎస్.వాసు, కృష్ణవేణి, రమణమ్మ, తలుపులమ్మ, భాగ్యలక్ష్మి, బి.శ్రీకాంత్, ఎం.ఏసు, ఎం.రవి, వసంత్, జనార్ధన్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్ర బడ్జెట్ వల్ల ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్లో విభజన హామీలు అమలుకు నిధులు లేవని, పోలవరం నిర్వాసితుల ఊసు లేదని, రాష్ట్ర అభివద్ధికి రాజధాని నిర్మాణానికి ప్రత్యేక నిధులు లేవన్నారు. ప్రజలపై పన్నులు భారాలు, వేసి కొద్దిమంది కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు అడ్డంగా దోచి పెడుతున్నారన్నారు. ప్రజా ఆస్తులు, సంస్థలు డిజిన్వెస్టిమెంట్ పేరుతో అమ్మివేసి కార్పొరేట్ లకు పంచిపెట్టడానికి మరింత ఉతమే ఈ బడ్జెట్ అన్నారు. కౌలు రైతులను పట్టించుకోకుండా, నానో ఎరువులు పేరుతో, రైతులను మోసాగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన మూడు పార్టీలు రాష్ట్రానికి కేంద్రం చేసిన అన్యాయంపై నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్రానికి బిజెపి చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి సిపిఎం తీసుకువెళుతోందన్నారు.

వేతన జీవులకు కేంద్ర బడ్జెట్ నిరాశ పరిచిందని యుటిఎఫ్ జిల్లా నాయకులు ఐ.ప్రసాదరావు అవేదన వ్యక్తం చేశారు. రూ.47.66 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌లో సగటు ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల లోకాన్ని తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు.

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ దీక్ష

ప్రజాశక్తి-కాకినాడ

ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని గురువారం యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు బి.నాగమణి అధ్యక్షతన నిరహారదీక్ష నిర్వహించారు. ఈ దీక్షలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి టి.రవి చక్రవర్తి ప్రసంగించారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించలేని పరిస్థితికి దిగజారిపోయిందన్నారు. 17వ తేదీకి కూడా జీతం వస్తుందో లేదో అనే పరిస్థితిలో ఉద్యోగ, ఉపాధ్యాయులు లోన్లకు పెనాల్టీలు కడుతూ బాధ పడుతున్నారని తెలిపారు. పిఆర్‌సి, డిఎ ఎరియర్లు రూ.12,000 కోట్లు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలు రూ.1500 కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.4500 కోట్లు మొత్తంగా రూ.18000 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి బకాయిలు చెల్లించాలని లేకపోతే దశలవారీగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో జనవరి నెలలో ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు కెవివి.నగేష్, కార్యదర్శులు సిహెచ్. సూరిబాబు, షేక్ రెహమాన్, బిటి.సీతారామయ్య, ఎస్.వీరబాబు, వి.మహేష్ కుటుంబ సంక్షేమ పథకం బాధ్యులు ఎ.సీతారామరాజు, ఎం.సోమరాజు, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, కాజులూరు, పెద్దాపురం టౌన్, శంఖవరం, ఏలేశ్వరం కార్యకర్తలు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు



రిలే దీక్షలో పాల్గొన్న మహిళలు, నాయకులు

సాల్ట్ భూములు స్థానికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 47/3 లోని 4.24 ఎకరాల సాల్టు భూముల్లో స్థానికులకే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు గురువారం రిలే దీక్షలు చేపట్టారు. ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన భూముల్లో స్థానికేతరులకు పట్టాలు ఇవ్వడం తగదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దాట్ల సుబ్బరాజు అన్నారు. స్థానికులు చేస్తున్న దీక్షలకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మద్దతు తెలిపారు. రాయుడు దుర్గ, టిల్లపూడి భవాని, అల్లం లక్ష్మి, సత్యనారాయణమ్మ, మేడపాటి దేవానంద్, పులపకూర చినబాబు, కొంకి రాజు, రమణ తదితరులు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ట త్రిమూర్తులు, గర్రె లక్ష్మీనారాయణ, అత్తిలి బాబూరావు పాల్గొన్నారు.

ఆదిత్యలో రోడ్డు భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో విద్యా సంస్థల డ్రైవర్లు, విద్యార్థులకు గురువారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల నేపథ్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. పెద్దాపురం డిఎస్‌పి కె.లలిత కుమారి, ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బివి.మురళీకృష్ణ మాట్లాడారు. వాహనదారుల భద్రత, ప్రయాణికుల క్షేమం ధ్యేయంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. అత్యధిక రోడ్డు ప్రమాదాలు బైకుల వల్ల సంభవిస్తున్నాయని, అతివేగం, హెల్మెట్ ధరించకపోవడం నిబంధనలు పాటించకపోవడం దీనికి కారణాలని తెలిపారు. రోడ్డు భద్రత కోసం రవాణా శాఖ అన్ని రకాల చర్యలూ తీసుకుంటోందని, ఇప్పటికే ఉన్న కెమేరాలకు అదనంగా 2,300 కెమేరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వాహనదారుల సహకారం కూడా అవసరం అని అన్నారు. డాక్టర్ శేఖర్, డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స గురించి వివరింఆచరు. సిఐ.రవికుమార్, ఎస్ఐ నవుడు రామకృష్ణ, ఎంవిఐ ఎస్.దుర్గా విఠల్ పాల్గొన్నారు.



ధ్వంసమైన ఇల్లు

అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని గుమ్మరేగుల గ్రామంలో అక్రమంగా చేస్తున్న మైనింగ్ తవ్వకాలను గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గ్రామ శివారు ఉన్న ఊరకొండ నుంచి గత కొన్ని రోజులుగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. దీంతో గురువారం గ్రామానికి చెందిన బండారు నారాయణమ్మకు చెందిన ఇల్లు శబ్దాలకు కూలిపోవడంతో బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై ధర్నా చేపట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

3న సిఎం సభకు జనసమీకరణ

ప్రజాశక్తి - కిర్లంపూడి

వైసిపి నాయకుడు దాడి చిన్న బుజ్జి నివాసంలో గురువారం వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 3న ఏలూరులో జరిగే ముఖ్యమంత్రి సభకు భారీగా జన సమీకరణ చేసి సభలో పాల్గొనాలని కార్యకర్తలకు తెలిపారు. గ్రామంలో ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే దాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం దృష్టిలో ఉంచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వాలంటీర్లకు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రతి పథకాన్ని అందేలా చూసి వచ్చే ఎన్నికల్లో వైసీపీ పార్టీ విజయదుందుభి మోగించేలా వాలంటీర్లు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాడి సంతోష్ , శరకణం శ్రీను పాల్గొన్నారు.

పలువురు ఎంపిడిఒల బాధ్యతల స్వీకరణ

జిల్లా బదిలీపై వచ్చిన పలువురు ఎంపిడిఒలు ఆయా మండల కేంద్రాల్లో గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కోటనందూరు ఎంపిడిఒగా ఎన్.జయమాధవి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి ఆమె బదిలీపై వచ్చారు. కోటనందూరులో పనిచేస్తున్న ఎంపిడిఒ ఎస్ఎస్.శర్మ ఏలూరు బదిలీపై వెళ్లిపోయారు. ఎంపిపి లగుడు శ్రీనివాసరావును ఎంపిడిఒ మర్యాదపూర్వకంగా కలిశారు. **అన్నవరం** శంఖవరం ఎంపిడిఒగా ఎం.విజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన విశాఖపట్నం నుండి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ స్థానిక ఎంఎల్ఎ, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. **పెద్దాపురం** ఎంపిడిఒగా ఎం.ఉషారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన బి.అశోక్ కుమార్ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడలో విధులు నిర్వహిస్తున్న ఉషారాణి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఉషారాణిని కార్యాలయ పరిపాలన అధికారి సత్యనారాయణమూర్తి, రాజశేఖర్, కార్యాలయ సిబ్బంది జగన్నాథం, పంచాయతీల కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిశారు. **సామర్లకోట రూరల్** ఎంపిడిఒ డిఎస్.శ్యామ్ సుందర్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వర్తించిన డి.శ్రీలలిత నిడదవోలుకు వెళ్లారు. ఆ స్థానంలో విశాఖ జిల్లా నుంచి శ్యామ్ సుందర్ బదిలీపై వచ్చారు. ఇఒపిఆర్‌డి కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎఒ మంగ తాయారు ఆయనకు స్వాగతం పలికారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్, అర్బన్ మండలాలకు సంబంధించిన ఆశా వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ గత నెల నుంచి ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఉన్న సమస్యలపై మూడుసార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఇంతవరకు పరిష్కారం కాలేదన్నారు. ఆశా వర్కర్లపై పని ఒత్తిడి, అధికారుల వేధింపులు బాగా పెరిగాయన్నారు. వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. తమకు సంబంధం లేని పనులు ఆన్‌లైన్ వర్కులు చేయాలని, 20 రికార్డులు నిర్వహించాలని, ఉదయం తొమ్మిది గంటలకే వచ్చి సంతకాలు పెట్టాలని చెప్పారు. అధికారుల వేధింపుల వల్ల తూరంగి పిహెచ్‌సిలో ఆశా వర్కర్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిందన్నారు. ఆమె సమస్యను ఇంతవరకు పరిష్కరించ లేదన్నారు. అనంతరం అధికారులు వచ్చి నాయకులను చర్చలకు పిలిచారు. సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో ఎం.భారతి ప్రియ, మొగలి బేబీ, లక్ష్మి, సత్యవతి, అంకాడి పద్మావతి, చెక్కల వేణి, సత్యవేణి, రామలక్ష్మి, భార్గవి, రష్మి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు 50 వసంతాలు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

విశాఖపట్నం హైదరాబాద్ మధ్య నడుస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు నేటితో 49 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో విశాఖపట్నం హైదరాబాద్ మధ్య 1974 ఫిబ్రవరి 1న ట్రైన్ నెంబర్లు 7007, 7008తో ఈ రైలును ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం 12727, 12728 నెంబర్లతో గోదావరి రైలు నడుస్తోంది. నేటితో సరిగ్గా ఈ రైలు సేవలు ప్రారంభించి 50 సంవత్సరాలు అయ్యింది. 710 కిలోమీటర్ల దూరం నిత్యం 441 నిమిషాల పాటు ప్రయాణించి ప్రయాణికులను ఈ రైలు గమ్యం చేరుస్తుంది. దీని హాల్టల సంఖ్య 18 కి చేరింది.

నేడు ఎలుకల మందు పంపిణీ

ప్రజాశక్తి -కరప

ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎవి.రాజేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు కరపలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎలుకల మందు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. 23 గ్రామాల్లో ఈ నివారణ మందు రైతు భరోసా కేంద్రాల వద్ద పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట రాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో నారాయణ సేవ అధ్యక్షురాలు ఎం.వరలక్ష్మి సౌజన్యంతో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరోపకారం పరిమళత్వం ద్వారా మానవజన్మ ధన్యం అవుతుంది కాబట్టి ప్రతి ఒక్కరూ సాటి మానవుల పట్ల ప్రేమతో వ్యవహరించాలని అన్నారు. మన నడక, ప్రవర్తనను బట్టే జీవితానికి విలువ ఉంటుంది కాబట్టి ఆదర్శ వంతంగా నడవాలని అన్నారు. మన చుట్టూరా ఉన్న లోకాన్ని తీర్చిదిద్దాలని వరలక్ష్మి తెలిపారు.

కార్టూ'నిజం'



ఈ రికార్డును మాత్రం భవిష్యత్‌లో ఏ సర్కారూ బ్రేక్ చేయలేదేమో సార్..!!



మ్యానిఫెస్టోను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

రాష్ట్రాభివృద్ధి కోసమే పార్టీ ఏర్పాటు

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రాభివృద్ధి కోసమే తాను పార్టీ స్థాపించానని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ తెలిపారు. గురవారం ఆయన కాకినాడ నగరంలో పలువురు మేధావులు, సీనియర్ రాజకీయ నాయకులతో కలిసి స్థానికంగా ఆయన పార్టీ మేనిఫెస్టో ఆవిష్కరించి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే దిశగా తనతో పాటు నడిచేందుకు వచ్చే వారికి ఆహ్వానం పలికారు. తాను కేవలం రాష్ట్ర భవిష్యత్తు, యువత అభివృద్ధే లక్ష్యంగా పార్టీని పెట్టినట్లు చెప్పారు. తాను ఎందుకు రాజకీయాల్లోకి వచ్చానో తన మేనిఫెస్టో చదివిన అందరికీ అర్థం అవుతుందన్నారు. అందుకే తాను జై భారత్ పార్టీ పెట్టినట్లు తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపు : నెహ్రూ

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్, గండేపల్లి

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి గెలుపు ఖాయమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలో వైసిపి మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ కందుల చిట్టిబాబు కుటుంబ సభ్యులు, ఆయన అనుచర గణం భారీగా జ్యోతుల నెహ్రూ సమక్షంలో టిడిపిలో చేరారు. జెడ్. రాగంపేట నుంచి భారీ బైక్, కార్లతో ర్యాలీగా మురారి గ్రామం చేరుకున్నారు. అక్కడ కందుల కొండయ్య దొర విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి జగ్గంపేట, గోకవరం రోడ్డులోని సాయి బాలాజీ ఫంక్షన్ హాల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో కందుల చిట్టిబాబు మాట్లాడుతూ కొండయ్య దొర ఆశయం మేరకు టిడిపి, నెహ్రూ ఆదేశానుసారం పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపసారు. కందుల చిట్టిబాబు, విజయ్, వినయ్ సుమారు 500 మంది టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, ఎస్‌విఎస్.అప్పలరాజు, కోర్పు సాయి తేజ, పాలకుర్తి ఆదినారాయణ, యర్రంశెట్టి బాబ్జీ, కంటిపూడి రామయ్య, అడబాల భాస్కరరావు, సుంకవల్లి రాజు, కొత్త కొండబాబు, మణిబాబు, చినబాబు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల నెహ్రూ

నేరాలు ఘోరాలు


ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకొడుకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - కొత్తపేట

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన చోటుచేసుకున్నట్లు కొత్తపేట ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చీమల మాధవరావు తన తండ్రి నరసింహారావు కలిసి తన ద్విచక్ర వాహనంపై వాడపాలెం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చారు. వారు తిరిగి తన ఇంటికి వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ బండి మోషే తన ఆటోతో పలివెల వైపు వస్తుండగా మార్గమధ్యలో చొదరిపురం సత్తెమ్మ తల్లి గుడి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మాధవరావు(43)ఆటోపై వస్తున్న మోషే(35) ఇద్దరూ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. నరసింహారావుకు బలమైన గాయాలు తగలడంతో వైద్యం కోసం రాజమహేంద్రవరం తరలించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్ఐ పరిశీలించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురికి రిమాండ్

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం లక్ష్మీ కళ్యాణ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో వెయిటర్‌పై దాడి ఘటనలో రంగిలి ఈశ్వరగణేష్, పోసిన వీరభద్రం, తోట దీపకపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని నార్త్‌జోన్ ఇన్‌ఛార్జి డిఎస్‌పి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం గోకవరం పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. రెస్టారెంట్ వద్ద బుధవారం సాయంత్రం బిర్యానీ కోసం ముగ్గురు వ్యక్తులు వెళ్లారు. రెస్టారెంట్ వెయిటర్ పులపర్తి రాజు ఒక బిర్యానీ రూ.200 అని వారికి తెలిపాడు. బిర్యానీ రూ.150 అంటూ వారు రాజుతో వాగ్వాదానికి దిగారు. పక్కనే ఉన్న గాజు డ్రింక్ బాటిల్‌ను పగలగొట్టి రాజుపై దాడి చేశారు. తీవ్ర గాయాలైన రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న గోకవరం పోలీసులు వెంటనే స్పందించారు. ఈ కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని డిఎస్‌పి తెలిపారు. వివిధ పత్రికల్లో బ్లేడ్ బ్యాచ్ దాడి చేసిందటూ వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. ఇవి పూర్తిగా అవాస్తమని తెలిపారు. రెస్టారెంట్ సిబ్బందికి, నిందితులకు గతంలో కూడా ఎప్పుడూ పరిచయాలు లేనట్లుగా తమ విచారణలో తేలిందన్నారు. ఈ ఘటన అప్పటికప్పుడు జరిగిందన్నారు.

వీధి బాలల రక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తల్లిదండ్రులు లేక అనాథల్లా వీధుల్లో తిరుగుతున్న బాలలను గుర్తించి వారికి పునరావాసం కల్పించడంతోపాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వీధి బాలల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వీధి బాలల గుర్తింపుగాను పోలీస్ శాఖతోపాటు తమ సంస్థ కూడా నిరంతరం అన్వేషణ చేస్తుందని అన్నారు. ఇందుకుగాను ప్రత్యేక డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. వీధి బాలలను చిన్నతనంలో గుర్తించి సరైన మార్గంలో పెట్టకపోతే వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. పిల్లలు భారంగా అనిపించినా లేదా వయస్సు కాకుండా గర్భం దాల్చి కన్న పిల్లలను తమ సంస్థ ద్వారా పిల్లలు లేని దంపతులకు చట్టరీత్యా దత్తత ఇచ్చి పరోక్షంగా వీధి బాలలు లేకుండా చేస్తున్నామని వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, శ్రీనివాసరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కౌన్సిలర్ నక్కా లలిత మృతి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ నక్కా లలిత (37) గురువారం మృతి చెందారు. ఆమె మృతికి వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, పార్టీ సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తీవ్ర సంతాపం తెలిపారు. కౌన్సిలర్ లలిత ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమె మృతికి వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, కౌన్సిలర్లు ఘనంగా నివాళులు అర్పించారు.

ఉపాధిని పగడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ప్రజాసంఘాల భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు కోత పెట్టి కూలీల పొట్ట కొట్టిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం, వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి నిధుల ద్వారా మాత్రమే రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉపాధి పనులు ఎక్కువ చేస్తేనే నిధులు అదే విధంగా వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఉపాధి హామీ నిధులు సాధించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కూలీలకు పనులు కల్పించకపోతే ఉపాధి కూలీలు వలస బాట బాట పట్టే అవకాశం ఉందన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.శ్రీనివాస్

ఇదే పరిస్థితి కొనసాగితే ఫిబ్రవరి, మార్చ్ నెలల్లో కూలీలు వలస పోవాల్సి వస్తుందని తెలిపారు. చదువుకున్న మహిళలను మేట్లగా నియమించి వారికి పారితోసికం ఇవ్వలేదని, సెల్ ఫోన్లు ఇచ్చి రీఛార్జి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దుప్పి అదృష్టదీపుడు, మందనక్క తణుకు రాజు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, దానం మాలయ్య, దండాల అబ్బులు, అనసూయ, వెంకటలక్ష్మి, శైలజ, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక భరోసాకు ఆసరా

ప్రజాశక్తి - పెద్దాపురం

మహిళల ఆర్థిక భరోసాకు వైఎస్ఆర్ ఆసరా ఎంతో దోహదపడుతుందని వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు అన్నారు. గురువారం స్థానిక లూథరన్ హైస్కూల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివద్ధి కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బత్తుల ప్రియంవద మాట్లాడుతూ పెద్దాపురం పట్టణ పరిధిలో 4వ విడత ఆసరా పథకానికి సంబంధించి 714 డ్వాక్రా గ్రూపులకు చెందిన 6950 మంది మహిళలకు రూ.5,95,63,182 మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, ఆగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, మెప్మా సిఎంఎం



మహిళలకు ఆసరా చెక్కులు అందజేస్తున్న దొరబాబు

జి.భ్రమరాంబ, మున్సిపల్ కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆకుల కృష్ణ బాపూజీ, పెంటకోట సత్తిబాబు, గోకేడ అప్పారావు, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, సిఖలు శ్రీదేవి, ఉమా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైయస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో పోలేకుర్రు పంచాయతీ సుంకటరేవు వద్ద శుక్రవారం ఆసరా కార్యక్రమం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ఎంపిపి రాయుడు సునీత గంగాధర్ పర్యవేక్షించారు. ఆసరా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పాల్గొంటున్నట్టు చెప్పారు. నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరాలో భాగంగా మండలంలోని 1477 సంఘాలకు రూ.10 కోట్ల 75 లక్షలు ఆయా సంఘాల ఖాతాలకు జమ చేయనున్నట్లు ఎపిఎం సన్యాసిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కాదా గోవింద్ కుమార్, రాయుడు గంగాధర్ వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, కాశి లక్ష్మణస్వామి, పలివెల నాగేశ్వరరావు, నీలపాల శ్రీనివాస్, పెయ్యల శ్రీనివాస్, యానిమేటర్లు ఈశ్వరి బాయి, మంగమణి పాల్గొన్నారు.

పోలేకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్

జరగనున్న ఆసరా బహిరంగ సభ ఏర్పాట్లపై సంబందిత అధికారులతో ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మాట్లాడారు. వచ్చిన ప్రజలందరికీ భోజన సౌకర్యాలు ఇబ్బంది లేకుండా చూడాలని నాయకులను ఆదేశించారు.

జగన్‌ను సాగనంపండి: యనమల దివ్య

ప్రజాశక్తి-కోటనందూరు

సిఎం వైఎస్.జగన్‌ను సాగనంపాలని టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య అన్నారు. గురువారం తుని రూరల్ సీతయ్యపేటలో మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ను ఓడించడానికిగా ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. చంద్రబాబు పాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి అధోగతి పాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో యనమల శివరామ కృష్ణన్, పొల్నాటి శేషగిరి, మోత్కూరి వెంకటేష్, యనమల భాస్కర్, అప్పన రమేష్, జనసేన సమన్వయకర్త చోడిశెట్టి గణేష్, వంగలపూడి బుజ్జి, చింతంనీడి అబ్బాయి, యాదాల లోవకృష్ణ, గొర్ల తాతబాబు, వీపు అప్పారావు, గొర్ల బాబ్జీ, బొట్టా దేవుళ్లు, కోన బుజ్జి, పల్లా ఈశ్వర, మిరియాల సత్తిబాబు, పంపనబోయిన


ప్రజలతో మాట్లాడుతున్న యనమల దివ్య

బాబ్జి, దార్ల శ్రీను, సారిపిల్లి గోవిందు, బంధం వెంకటరమణ పాల్గొన్నారు.

నాలుగో రోజుకు న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఎపి ల్యాండ్ టైటిల్ యాక్టర్ రద్దు కోరుతూ ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో న్యాయవాదులు నిర్వహిస్తున్న దీక్షలు గురువారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని 624 సివిల్ కోర్టులు పరిష్కరించలేని లావాదేవీలు కేవలం 24 మంది టైటిలింగ్ అధికారులు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. న్యాయ శాస్త్రంలో ఎటువంటి అనుభవం లేని రెవెన్యూ అధికారులు టైటిలింగ్ అధికారులుగా నియమించడం వల్ల అనేక అవకతవకలు జరిగే అవకాశం ఉందన్నారు. యాక్ట్ రద్దు చేసే వరకు తమ ఉద్యమాన్ని ఆపేది లేదని, మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదులు కొల్ల వీర్రాజు, ఆకుల హరిబాబు, మళ్ల గంగాధర్, రవణం వెంకట్రావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, మంజుష ఉన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కార్మికుల బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కోటనందూరు

భవన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ కోటనందూరులో సచివాలయం వద్ద సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ ఆధ్వర్యంలో భవన కార్మికుల నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ 1214 జిఒ రద్దు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 2019 నుండి పెండింగ్ పెట్టిన రూ.ఐదు కోట్ల పరిహారాలను కార్మికులకు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.నాగేశ్వరావు, పి.శ్రీను, బొజ్జా నూకరాజు, సూరిబాబు, నాగ సత్తిబాబు. అప్పారావు, మాణిక్యం పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వరుపుల సత్యప్రభ

టిడిపి నేతలకు ఎన్నికలపై శిక్షణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభ రాజా ఆదేశాల మేరకు టిడిపి ప్రత్తిపాడు, శంఖవరం మండలాల ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులకు గురువారం సమగ్ర శిక్షణ ఇచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయ సిబ్బంది, రాబిన్ శర్మ టీమ్ సభ్యులు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్, రెండు మండలాలకు చెందిన టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 50 వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.ఫిలిప్‌రాజు, ఎన్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పోస్టులు భర్తీ చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించారన్నారు. ఇప్పుడు 6 వేలు పోస్టులు మాత్రమే భర్తీ చేస్తానని, వారికి రెండేళ్ల పాటు అప్రెంటిస్ విధానంలో నెలకు రూ.1200, రూ.1500 మాత్రమే జీతాలు ఇచ్చి వెట్టి చాకిరీ చేయిస్తామని ప్రకటించడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

చీడిగలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ ఆలయ నిర్మాణానికి రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ గురువారం శంకుస్థాపన నిర్వహించారు. వైసిపి బిసి సెల్ కార్యదర్శి అరిపిరాల నాగు, విశ్వకర్మ కార్పెంటర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లింగం రవి, పెద్దపాటి వీరబాబు, చిట్టిమొజ్జి శ్రీనివాస్, బన్నల నూకరాజు, కె.సుబ్రహ్మణ్యం, కొప్పిశెట్టి గణేష్, దూనబోయిన అరుణ, గీసాల శ్రీను, అనసూరి ప్రభాకర్, కరీం బాషా, సత్తి చిన్నారి, కొత్తపల్లి గిరీష్, కర్రి చక్రధర్ పాల్గొన్నారు.

యానాం వార్తలు


సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

నష్ట పరిహారం కోసం ఐక్య పోరాటం

ప్రజాశక్తి - యానాం

ఎఎన్జిసి చమురు సంస్థ నుండి మత్స్యకారులకు రావలసిన వేట నష్టపరిహారం తక్షణమే అన్ని పార్టీలు కలిసి పోరాడుతామని అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆయా పార్టీల ప్రతినిధులు తెలిపారు. గురువారం స్థానిక గాజుల వీధిలో ఉన్న పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలు చేపల వేట జీవనాధారంగా జీవిస్తున్నారని చేపల వేటకు వెళ్లకుండా ఉండడానికి ఒఎన్జిసి చమురు సంస్థ నష్టపరిహారం ఇవ్వాల్సి ఉండగా నష్టపరిహారం ఇవ్వకుండ కాలయాపన చేయడాన్ని వారు ఖండించారు. సుమారు రూ.23 కోట్ల నష్టపరిహారం ఉపాధి కోల్పోయిన బాధితులు మత్స్యకారులకు అందించడంలో పుదుచ్చేరి ప్రభుత్వం విఫలమైందని వారు తెలిపారు. స్థానిక అధికారులు నిర్లక్ష్యం కారణంగా కూడా నష్టపరిహారం అందకపోవడాన్ని వారు ఆరోపించారు. అఖిలపక్షాలు అందరినీ కలుపుకొని మత్స్యకారులకు అండగా ఉండి నష్టపరిహారం అందేటట్లు పోరాటం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తుల గోవింద జయ రామారావు, బిజెపి పార్టీ ప్రెసిడెంట్ కనకాల రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాడి సత్తిబాబు, మల్లాడి బీరస్వామి, బిఎస్‌పి నాయకులు ధూళిపూడి మధు, శ్రీమంతుల శ్రీధర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొండమూరి హరి, దవులూరి పతి, ఆరిశెట్టి రాజేష్, ప్రెస్సింగి రాంబాబు, దుగ్గుదుర్తి అనిత పాల్గొన్నారు.

యానాం పోలీసులకు బదిలీలు

ప్రజాశక్తి - యానాం

పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ త్వరలో ప్రకటించనున్న నేపథ్యంలో పుదుచ్చేరి పోలీసుశాఖ బదిలీల ప్రక్రియ తాజాగా చేపట్టింది. ఆరుగురు సిఐలు, 59 మంది ఎస్ఐలు, 117 మంది హెచ్‌సిలు, 320 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. యానాం లా అండ్ ఆర్డర్ ఎస్ఐగా జె.మురుగానందం, ట్రాఫిక్ ఎస్ఐగా శేరు నూకరాజును నియమించారు. సిసిఆర్ సెల్ ఎస్ఐ కట్టా సుబ్బరాజు, పుదుచ్చేరి సిసిఆర్ విభాగానికి, పువ్వల వీరభద్ర స్వామిని పుదుచ్చేరి తూర్పు ట్రాఫిక్ విభాగానికి తక్షణమే బదిలీ చేస్తూ ఎస్‌పి సుభం ఘోష్ ఆదేశాలు జారీ చేశారు. యానాంలో ముగ్గురు హెచ్‌సిలు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

యానాం నూతన ఎస్‌పిగా రాజశేఖరన్

ప్రజాశక్తి - యానాం

యానాం నూతన ఎస్‌పిగా రాజశేఖరన్‌ను నియమిస్తూ అండర్ సెక్రెటరీ హారన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు యానాం ఎస్‌పిగా పని చేసిన రఘునాయుగం పుదుచ్చేరిలోని స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

మున్సిపల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - యానాం

యానాం మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా పెనుబోతు కృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా కర్రి రాంబాబు, సెక్రటరీగా చెల్లి గోపీనాథ్, జాయింట్ సెక్రటరీగా అత్తిలి గోవిందరాజు, ట్రెజరర్‌గా వి.తేజ కిరణ్మయి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వి.వీర కుమార్, యనమదల రాంబాబు, దంగేటి చిన వెంకన్న, ఎన్‌డి.ప్రసన్నకుమార్‌ను ఎన్నుకున్నారని సెక్రటరీ చెల్లి గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలపై నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ క్లెయిములు విడుదల చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ, కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం తహశీల్దార్ పి.త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కె.చిన్న మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సంక్షేమ బోర్డు నిధులు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మళ్లించారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సంక్షేమ బోర్డు నిధులు భవన నిర్మాణ కార్మికులకి ఖర్చు చేయాలని ఉన్న ఆ తీర్పును


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లెక్కచేయక వైసిపి ప్రభుత్వం కార్మికులకు పెండింగ్ క్లెయిములు పరిహారాలు ఇవ్వకుండా మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. పి.చిరంజీవి, మోహనాచార్యులు, ఎం.సత్తిబాబు, కిరణ్ కుమార్, బ్రహ్మజీ, అర్జున్ రావు, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్టు నివారణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

కుష్టు వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే పూర్తిగా నివారించవచ్చని డాక్టర్ కె.వెంకటరమణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. చర్మంపై బొడిపెలు, రంగు మారినట్లుగా మచ్చలు, స్పర్శ లేకపోవడం, కనురెప్ప వెంట్రుకలు కనుబొమ్మలు పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బ తినడం వంటివి కుష్టు వ్యాధి లక్షణాలు అని అన్నారు. రోగులతో కలిసి భోజనం చేయడం వారితో పాటు కూర్చోవడం వల్ల ఈ వ్యాధి ఇతరులకు సోకదని అన్నారు. నేటి ఆధునిక చికిత్సతో ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చు అని వెంకటరమణ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. అడబాల రత్న ప్రసాద్, యనమల రామం, రాజా పాల్గొన్నారు.

పక్షవాతానికి వెంటనే వైద్య చికిత్స అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పక్షవాతం వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య చికిత్స అందిస్తే త్వరగా కోలుకుంటారని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెదడులో కణుతులు, కొవ్వు పదార్థాలు అధికంగా తీసుకోవడం, మెదడువాపు, గుండె జబ్బు, స్థూలకాయం, అధిక రక్తపోటు, మానసిక ఒత్తిడి వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. ఆకస్మాత్తుగా శరీరంలోని ఒక భాగంపై నియంత్రణ కోల్పోవడం, అయోమయం, కళ్లు తిరగడం, ఆకస్మాత్తుగా తీవ్రమైన తలనొప్పి, వాంతులు, మూతి ఒకవైపుకు వంకరపోవడం, ఒకే వస్తువు రెండుగా కనపడటం ఈ వ్యాధి లక్షణాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో నేరాలపై అప్రమత్తత అవసరం

సామర్లకోట రూరల్ : రైళ్లలో జరిగే నేరాలు, అవాంఛనీయ సంఘటనలపై వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని రైల్వే ఎస్ఐ లోవరాజు అన్నారు. గురువారం సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో భద్రత, ప్రయాణంలో జరిగే ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు, రాళ్లు రువ్వడం, రైళ్లలో గంజాయి, మద్యం నిషేధిత వస్తువులు, మండే వస్తువులను రవాణా చెయ్యడం వంటి వాటిపై రైల్వే స్టేషన్లో పలు వ్యాపారాలు నిర్వహించే వారికి, హ్యాకర్లకు ఆయన అవగాహన కల్పించారు. అలాంటి సంఘటనలు స్టేషన్లో ఎక్కడ జరిగినా సమాచారం అందించాలన్నారు. ప్రయాణి కులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన భాద్యత మనందరిపైనా ఉందన్నారు.

చైర్‌పర్సన్ కుటుంబానికి పరామర్శ

సామర్లకోట రూరల్ : సామర్లకోట మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి కుటుంబాన్ని జనసేన పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి గురువారం పరామర్శించార. చైర్ పర్సన్ అరుణ మామ గంగిరెడ్డి స్వామి నాయుడు మృతి చెందారు.

నేడు ఎలుకల మందు పంపిణీ

గండేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఎలకల నిర్మూలన మందు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద వ్యవసాయ, ఉద్యాన సహాయకుల ద్వారా ఎలుకల మందు పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.